ప్రజాశక్తి
శనివారం 11 ఫిబ్రవరి 2023
5
కర్నూలు





కర్నూల్ లో సచివాలయంలో తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

సచివాలయాలను తనిఖీ చేయాలి

జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సచివాలయాల సేవలను పెంచడానికి గాను స్పెషల్ ఆఫీసర్లు నిత్యం సచివాలయాలను తనిఖీ చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా నందు ఉన్న 86, 87, 88 వార్డు సచివాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయాల్లో సర్వీసులను పెంచే దిశగా స్పెషల్ ఆఫీసర్లు కృషి చేయాలన్నారు. అనంతరం సచివాలయంలోని హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, తదితర రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో ఎంత మంది వాలంటీర్లు సిబ్బంది ఉన్నారు ? వారు బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ నిర్లక్ష్యం ఎవరిది?

- **విద్యుత్ శాఖలో పెన్షన్, గ్రాట్యుటీ కోసం ఎదురుచూపులు**
- **8 యేళ్ల నుండి 71 మంది ఉద్యోగులు అందని బెనిఫిట్స్**
- **27 మంది ఉద్యోగులు మరణం**

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ శాఖలో పని చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ అయిన రోజునే ఆ ఉద్యోగికి పెన్షన్, గ్రాట్యుటీ ఇవ్వాలని బిపినం: 501 ప్రకారం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కానీ 8 సంవత్సరాల నుండి 71 మంది ఉద్యోగులు రిటైర్మెంట్ అయితే నేటి వరకు పెన్షన్, గ్రాట్యుటీ ఇవ్వలేదు. ఈ ఎనిమిద్యే రాలంలో 27 మంది ఉద్యోగులు మరణించారు. 24 మంది రిటైర్మెంట్ టర్మినల్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈనిర్లక్ష్యం ఎవరిది. ఉన్నతాధికారులు ఎందుకు స్పందరనేది విద్యుత్‌శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యోగి రిటైరైయితే ఏఏ బెనిఫిట్స్ ఇవ్వాలి?: ఉద్యోగి సర్వీసులో ఉండి రిటైర్ అయితే పెన్షన్, గ్రాట్యుటీ, పెన్షన్ కమ్యుటేషన్ (40శాతం), నిల్వ ఉన్న ఎర్న్డ్ లీవ్ ఎన్క్యాష్‌మెంట్, ప్రావిడెంట్ ఫండ్ లో నిల్వ ఉన్న మొత్తం వడ్డీతోను, రిటైరైనతేది వరకు పని చేసిన కాలానికి ఎక్స్‌గ్రేషియా, జీతంలో లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలి. పాలసీ మెచ్యూరిటీ గడువు దాటిన సందర్భంలో ఎల్‌ఐసి నుండి రావలసిన మొత్తం డబ్బులు, గ్రూప్ ఇన్స్ రెన్స్ స్కీమ్ కింద సేవింగ్స్ అకౌంట్‌లో ఉన్న డబ్బు చక్రవడ్డీతో ఇవ్వాలి. సర్వీసులో ఉండగా కట్టిన సెక్యూరిటీ డిపాజిట్లు ఉంటే తిరిగి ఇవ్వాలి. ఇవన్నీ ఉద్యోగి రిటైరయితే రావాలి. వీటినే ఉద్యోగికి వచ్చే టర్మినల్ బెనిఫిట్స్ అంటారు. 2019 సంవత్సరం నుండి రిటైరైయిన ఉద్యోగులకు ఈ టర్మినల్ బెనిఫిట్స్ విద్యుత్ శాఖలో ఎందుకు పెండింగ్‌లో పెట్టారనేది అర్థం కాని పరిస్థితి.

ఉద్యోగి సంక్షేమం చూసే బాధ్యత ఎడిఎం సెక్షన్ అధికారులది కాదా?:

ముఖ్యంగా ఉద్యోగి సంక్షేమం చూసే పూర్తి బాధ్యత ఎడిఎం(అడ్మినిస్ట్రేషన్ సెక్షన్) సెక్షన్ అధికారులదే. ఉద్యోగి ఎప్పుడు ఉద్యోగంలో చేరింది. ఆయనకు ఇంక్రిమెంట్ ఎప్పుడు వస్తుంది. ఎప్పుడు ప్రమోషన్ వస్తుంది. సెలవులు ఎన్ని వాడుకున్నాడు. ఇంకా ఎన్ని సెలవులు ఉన్నాయి. మెడికల్ సెలవులు ఎన్ని ఉన్నవి. ఎన్ని మెడికల్ సెలవులు వాడుకుకున్నాడు. ఆయన ఎక్కడ పని చేస్తున్నారు. ఎక్కడికి బదిలి చేశారు. ఎప్పుడు బదిలి చేశారు. ఆయన జీతం ఎంత. బేసిక్, డిఎ, హెచ్‌ఆర్ఎ,మెడికల్ అలవెన్స్ ఎంత. ఉద్యోగి డిపార్టుమెంట్ నుండి ఏమైన అడ్వాన్స్ డబ్బులు ఇచ్చారా. అడ్వాన్స్ తీసుకొన్న డబ్బులు రికవరీ చేశారా ? లేదా ? బ్యాంకులో లోన్ తీసుకోవాడానికి అనుమతులు ఇవ్వడం, వాటి రికవరి బాధ్యత కూడా వీరిదే. ఇలాంటి అనేక సంక్షేమాలు వారే చూడాలి. వాటి నిర్వహణ మొత్తం ఆ ఉద్యోగికి సంబంధించిన సర్వీసు రిజిష్టర్ (ఎస్.ఆర్) నందు ప్రతిది నమోదు చేయాలి. వీటి ఆధారంగా ఆ ఉద్యోగి పదవి విరమణకు ఒక సంవత్సరం ముందు నోటీసు పంపిస్తారు. వీటన్నింటిని చూసే పూర్తి బాధ్యత ఎడిఎం సెక్షన్ అధికారర్లదే. మార్చి 2014 నుండి సెప్టెంబర్ 2022 వరకు 71 మంది ఉద్యోగులకు పెన్షన్ ప్రపోజల్స్ పంపితే, 2021 లో 33 మందికి, 2022 లో 38 మందికి పెన్షన్ మంజురు చేశారు. ఇందులో 24 మంది మరణించారు. మార్చి 2019 నుండి సెప్టెంబరు 2022 వరకు 24 మంది ఉద్యోగులు వారి టర్మినల్ బెనిఫిట్ కోసం పంపిస్తే ఇందులో ముగ్గురు మరణించారు. విద్యుత్ అధికారుల తీరు ఈ విధంగా ఉంది. ఎడిఎం సెక్షన్, పెన్షన్, గ్రాట్యుటి శాంక్షన్ చేసే అధికార్ల పక్షపాత దోరణి, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. రిటైర్మెంట్ బేనిఫిట్స్ ఇచ్చే దానిలో కూడా ఎడిఎం సెక్షన్ అధికారుల పక్షపాతం స్పష్టంగా ఉంది. మార్చి 2014 నుండి సెప్టెంబరు 2022 వరకు అనేక మంది అధికారులు అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు రిటైర్మెంట్ అయ్యారు. ఈ అధికారులకు రిటైర్మెంట్ టర్మినల్ బెనిఫిట్స్ ఎక్కడ పెండింగ్ లేవు. అందరికి అన్ని బేనిఫిట్స్ ఇచ్చారు. కేవలం ఒకే ఒక అసిస్టెంట్ ఇంజనీరు మార్చి 2019 లో రిటైర్ అయినప్పటికి నేటికి ఆయనకు టర్మినల్ బెనిఫిట్స్ ప్రప్రోజల్‌కు పంపించలేదు. అధికారుల లెక్కల ప్రకారం మార్చి, 2019 నుండి సెప్టెంబరు 2022 వరకు 24 మంది ఉద్యోగులు టర్మినల్ 17 మంది ఉ ద్యోగుల నుండి టర్మినల్ బెనిఫిట్స్ కోసం ప్రప్రోజల్ రాలేదు. ముగ్గురి టర్మినల్ బెనిఫిట్ ప్రప్రోజల్స్ సర్కిల్ ఆఫీసులో ముగ్గురి ప్రజల్స్ డివిజన్ ఆఫీసు లో ఉన్నవని తెలిపారు.రిటైరై అయిన వారిలో నంద్యాల డివిజన్లో జూనియర్ లైన్మెన్ 26 మంది, డోన్ డివిజన్ ఇఆర్ఒ లో ఒకరు, హెచ్‌టి డివిజన్(కర్నూలు)లో ఒకరు, టిఆర్ఇ (కర్నూలు) ఆరుగురు, పిఆర్ఎస్ (కర్నూలు) ఇద్దరు, బనగానపల్లె(ఇఆర్ఒ) ఒక్కరు, డోన్ డివిజన్ నందు 10 మంది, కన్స్ట్రక్షన్(కర్నూలు) ముగ్గురు, ఆదోని డివిజన్‌లో ఎనిమిది మంది, కర్నూలు డివిజన్ 9మంది, జిల్లా స్టోర్స్ (కర్నూలు)లో ఒకరు, సర్కిల్ ఆఫీసు(కర్నూలు) నందు ఒకరు, ప్రొటెక్షన్ (కర్నూలు) నందు ఒకరు రిటైర్ అయ్యారు. పెన్షన్ గ్రాట్యుటీ ఇవ్వటంలో ఆలస్యం అయితే పెన్షన్ రూల్స్ 51 ప్రకారం యాంటీసిపేటరీ పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులు పెన్షన్ పై అవగాహన ఉన్న వారికి, ఇచ్చిన వారికి మాత్రమే వెంటనే మంజూరు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారికూడా ఒకరోజు రిటైర్డ్ కావాల్సిందేనని అది గ్రహించాలని చెబుతున్నారు. బాధ్యతారాహిత్యంగా చర్యలు తీసుకొని రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రిటైర్డ్ అయిన రోజునేపెన్షన్, గ్రాట్యూటీ వచ్చేలాగా చర్యలుతీసుకోవాలని కోరారు. వీటిపై విద్యుత్ శాఖ ఏ విధంగా స్పందించి చర్యలు తీసుకుంటుందో చూడాలి మరి.



పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలోని స్థానిక గుత్తి రోడ్డు సమీపంలో , దూపాడు సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకులో రికార్డుల నమోదు తో పాటు నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేశారు. ఆయనతోపాటు కర్నూలు అర్బన్ ఎఎస్ఒ రామాంజనేయరెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారులు పెట్రోల్ బంక్ సేల్స్ మేనేజర్ కూడా ఉన్నారు.

పప్పు శనగ

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకష్ణ

ప్రజాశక్తి-తుగ్గలి

పప్పుశనగ రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం తుగ్గిలి ఎంపిడిఒ కార్యాలయం ఎదుట రైతు సంఘం కమిటీ శ్రీనివాసులు అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. పప్పు శనగ రైతులు పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందన్నారు. పప్పు శనగ నిలువ కేంద్రాలు లేకపోవడంతో రైతుల తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో పప్పు శనగ రైతులకు ప్రత్యేక గోగౌడన్లను నిర్మించాలన్నారు. ఖరీఫ్ లో కూడా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల పాలై బతుకుతెరువు కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. నూరేళ్ల బతకాల్సిన రైతులు అప్పుల బాధ తాళలేక మధ్యలోనే తనవు చాలిస్తున్నారని అన్నారు. అదేవిధంగా 20-22 సంవత్సరం ఇన్సూరెన్స్ అందని రైతులకు తక్షణమే రైతుల అకౌంట్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కరించకపోతే ఆందోళన దిగడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీరాములు, శ్రీనివాసులు, రంగస్వామి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ



మాట్లాడుతున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్‌డే :ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ డే లక్ష్యమని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే ను నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు , ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది మొత్తం 25 మంది వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్, మెడికల్ సమస్యలు, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్‌పి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్‌పి సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. సిబ్బంది ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ , ఎఒ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్ పాల్గొన్నారు.



బాలోత్సవ వేడుకల లోగోను ఆవిష్కరించిన జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు

బాలోత్సవం -2023 లోగోను ఆవిష్కరించిన డిఆర్ఒ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చిన్నారులకు మధురానుభూతిని కలిగించే బాలల పండుగ బాలోత్సవం-2023 లోగో జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. మానసిన శారీరక ఉల్లాసాన్ని కలిగించే ఈ పండుగ విజయవంతమవ్వాలని ఆకాంక్షించారు. లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి జెఎన్. శేషయ్య నిర్వహణ కమిటీ ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, కల్చరల్ కన్వీనర్ ఎంపి బసవరాజు, కె.సురేష్ కుమార్ (యూటిఎఫ్), కమిటీ సభ్యులు ఉమ(కెసిసి), జె.రంగస్వామి (సుందరయ్య స్ఫూర్తి కేంద్రం) తదితరులు పాల్గొన్నారు. ఈనెల 27 28 తేదీల్లో జరిగే బాలోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ రామగిడ్డయ్య

ఫార్మసీతో చక్కటి భవిష్యత్తు

మైపర్ లో ఘనంగా ఫ్రెషర్స్ డేలో డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఫార్మసీ విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని , క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ రామగిడ్డయ్య సూసించారు. కర్నూలు మైపర్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్నూలు డిఎంఅండ్‌హెచ్‌ఒ రామగిడ్డయ్య హాజరయ్యారు , కళాశాల డైరెక్టర్ ఆదిములపు సురేష్ , అకాడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్ మాట్లాడారు. వారు మాట్లాడుతూ ఫార్మసీ కోర్సు పూర్తయిన వెంటనే అనేక కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు. రెగ్యులర్‌గా కళాశాలకు వచ్చి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె .సురేష్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నోడల్ అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : మార్చిలో జరిగే శాసనమండలి ఎన్నికలకు నోడల్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి నియమించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతిభద్రతల పర్యవేక్షణకు జిల్లా ఎస్‌పి మోడల్ కోడ్ పర్యవేక్షణకు ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డిఒలు వ్యవహరిస్తారు. ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది నియామకాలను కలెక్టరేట్ పరిపాలనాధికారి తో పాటు జిల్లా ఎన్ఐసి అధికారి వ్యవహరించనున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను జిల్లా పరిషత్ సిఇఒ , పోలింగ్ మెటీరియల్ ఏర్పాటుకు డిఆర్‌డిఒ పిడి, ఓటింగుకు అవసరమయ్యే బ్యాలెట్ పత్రాలు, పోస్టల్ బ్యాలెట్లను ఏర్పాటు చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షిస్తారు. పోలింగ్ మెటీరియల్ సరఫరా, ఉద్యోగుల తరలింపుకు అవసరమయ్యే వాహనాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి పర్యవేక్షిస్తారు. పోలింగ్‌కు అవసరమయ్యే బ్యాలెట్ బాక్స్ లను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులు వివరాలు వాటి పర్యవేక్షణకు నియమించిన కమిటీకి జిల్లా ఆడిట్ అధికారి పర్యవేక్షణ చేస్తారు. ఎన్నికలపై మీడియాలో వచ్చే కథనాలు వంటి వాటిని పర్యవేక్షించేందుకు జిల్లా పౌర సంబంధాల సమాచార శాఖ అధికారి చూస్తారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని

ప్రజాశక్తి-కోడుమూరు : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డిని, పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగ రాజును గెలిపించాలని కోడుమూరు విస్తృతంగా ప్రచారం చేశారు. కోడుమూరు పట్టణంలో పలు విద్యాసంస్థల దగ్గర ఉపాధ్యాయులను, పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు.సిఐటియు ఎఐటియుసి ,ఎస్‌టియు, యుటిఎఫ్ ఇతర ప్రజా సంఘాలు బల పరుస్తున్న పిడిఎఫ్ఎమ్మెల్సీ అభ్యర్థులను ఇద్దరిని గెలిపించాలని ,ఎమ్మెల్సీ ఓటర్ల దగ్గరికి వెళ్లి అభ్యర్థించారు. ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న, ఎఐటియుసి కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్. రసూల్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, కోడుమూరు మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి ఎ. రాముడు, ఎపి. రైతు సంఘం నాయకులు కె. మధు తదితరులు ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుకై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల కొరకు పోరాటం చేసిన పోరాట నాయకుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డిని, విద్యార్థి దశ నుండి అనేక సామాజిక ఉద్యమంలో పోరాటాలు కొనసాగిస్తూ, పట్టభద్రులు అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు పలు విద్యాసంస్థల టీచర్లను, పట్టబద్లను కలిశారు. మార్చిలో జరిగే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో వీరికి ఓటేసి గెలిపించాలని వారు కోరారు.



పిడిఎఫ్ అభ్యర్థులగెలుపునకు విస్తృత ప్రచారం



మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాసులకు నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసుల మృతి పట్ల ఆయన చిత్రపటానికి వర్సిటీ సిబ్బంది భోజన తర సిబ్బంది నివాళులర్పించారు. ఈ మేరకు వర్సిటీలో జరిగిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి వైస్ ఛాన్సలర్ ఆనందరావు, రిజిస్ట్రార్ సుందరానందపుచ్ఛా , రెక్టార్ సివి. కష్ణారెడ్డి ఆయా విభాగాల ప్రొఫెసర్లు పాల్గొని నివాళులర్పించారు. కొద్దిసేపు మౌనం పాటించి ఆయనకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.

తప్పిపోయిన పిల్లల కోసం రైల్వే వెబ్‌సైట్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తప్పిపోయిన పిల్లల ఆచూకీ వివరాలను తెలుసుకొనేందుకు రైల్వే శాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసింది. ఇంటి నుండి పారిపోయిన, తప్పిపోయిన పిల్లల వివరాలను ఫోటోలతో సహా https://indinrail-ways.gov.in%μμ, Track child portal-3.0μμ అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పొందుపరచారు. ఈ వెబ్‌సైట్‌ను ఆర్‌పిఎఫ్ పోలీసులు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 వారి సమన్వయంతో నిర్వహిస్తున్నారు. పిల్లలను పోగొట్టుకున్న తల్లిదండ్రులు సంరక్షకులు ఎవరైనా ఉంటే ఈ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవాలని, కర్నూలు ఆర్‌పిఎఫ్ సిఐ సత్యనారాయణ తెలిపారు.

ఉపాధి పనులను పిడి పరిశీలన

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని కొత్తకోట, ముడుమాల,కొండాపురం గ్రామాల్లో సాగుతున్న ఉపాధి పనులను ఉపాధి పిడి అమర్నాథ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇక్కడే కాల్వల అభివృద్ధి బేస్‌గా జరుగుతుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. పనులను సక్రమంగా చేయాలని వేళలు,కొలతల ప్రకారం తప్పనిసరిగా ఉండాలని అప్పుడే బిల్లులు ఆశించినంత వస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎపిఒ లక్ష్మన్న, ఇసి పృధ్వి, టిఎ లు సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పిడి అమర్నాథ్‌రెడ్డి

రైతుభరోసా కేంద్రాలను ఎఒ తనిఖీ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని ముడుమాల, కొండాపురం, బెళగల్ గ్రామాల్లో ఎఒమల్లేష్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. హాజరును పరిశీలించి రైతులకు రబీ సాగు ఈ పంట నమోదును, ఎకెవైసిని ముమ్మరం చేయాల్సిందిగా తెలిపారు. అలాగే సిబెళగల్ లోని వ్యవసాయ వనరుల కేంద్రంలో మండల సలహా కమిటీతో సమీక్షించి వ్యవసాయ పథకాలు అందేలా దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజశేఖర్ నాయక్, వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలి: కెవిపిఎస్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : సోషల్ మీడియా వేదికగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై చంపుతానంటూ అనుచితంగా మాట్లాడిన హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయడమే కాదు మరొకరు ఇలా మాట్లాడకుండా కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా కమిటి డిమాండ్ చేసింది.కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, జిల్లా అధ్యక్షులు ఎస్. దేవసహాయం, జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, ఎన్‌జి.కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి బి.కరుణాకర్‌లు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన హమారా ప్రసాద్ నిరంతరం తాను చేస్తున్న చిల్లర పనులకు తోడుగా వ్యక్తిగత పాపులారిటీని పెంచుకోవడం కోసం రాజ్యాంగ నిర్మాత పైనే ఖండ కావరమెక్కి మాట్లాడటం దేశ ప్రతిష్టకే అవమానకరమన్నారు. హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయడమే కాదు కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజల మధ్య కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతూ వాటికి దేశ నాయకులను ఉపయోగించుకునే ఇలాంటి ఉన్మాదులను కఠినంగా శిక్షించాలన్నారు. బాబాసాహెబ్‌ను చంపుతానని మొరగడమే కాక, గాంధీని చంపిన గాడ్సే వారసుడిగా ప్రకటించుకోవడం తన మత ఉన్మాదాన్ని తెలియజేస్తోందన్నారు. అంబేద్కర్ బతికి ఉంటే గాంధీని గాడ్సే కాల్చినట్లే నేను కూడా అంబేద్కర్‌ను కాల్చి చంపేవాడినని బహిరంగంగా ప్రకటించడాన్ని ఉపేక్షించరాదన్నారు. ఇది జాతికి జరిగిన అవమాణంగా పరిగనించి ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలన్నారు. జాతీయ నాయకులను కించపరిచే వారి పట్ల కఠినంగా వ్యవహారించాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు

మండల యుటిఎఫ్ కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి- గూడూరు : స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం యు టిఎఫ్ మండల నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కర్యాక్రమంలో జిల్లా యు టిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం జయరాజ్, యుఆర్ఎ రవి కుమార్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి ఉద్యోగులకి ఉపాధ్యాయులకు జీతాలు సరిగా అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిపిఎస్‌ను వెంటనే రద్దు పరచాలని, పెండింగ్లో ఉన్న పిఎఫ్, ఎపిజిఎల్ ఐ లోన్లను, డిఎలు సరెండర్ లీవ్‌లను వెంటనే మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. నూతన కార్య వర్గంలో గూడూరు మండల అధ్యక్షులుగా వి. శ్రీకాంత్, యుటిఎఫ్ ప్రధాన కార్య దర్శిగా ఎస్ మారెప్పను ఎన్నుకున్నారు. యుటిఎఫ్ సీని యర్ నాయకులు ఎం. హనుమంతు, కె. కాంతారావు, షఫీ ఆర్‌కెఎస్ అన్న, పి శ్రీనివాసులు, పి జయలక్ష్మి, ఎం.రాధా, వై రామాంజనమ్మ లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




ఉపాధ్యాయులను అభ్యర్థిస్తున్న గౌస్ దేశాయ్, తదితరులు

సమస్యలపై గళమెత్తే వారిని గెలిపించుకోవాలి

ప్రజాశక్తి - ఆదోని

నిరుద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చట్టసభల్లో గళమెత్తే వారిని గెలిపించుకోవాలని సిఐటియు, ఏఐటీయుసి, ఎస్‌టియు, ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలో ప్రచారం నిర్వహిస్తూ పీడీఎఫ్ నేతలు బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహా రెడ్డికి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులను వారు అభ్యర్థించారు. మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజుల గెలుపుకై సమిష్టిగా కృషి చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్, జిల్లా, పట్టణ నాయకులు రామాంజనేయులు, గోపాల్, తిప్పన్న, లక్ష్మన్న, సుదర్శన్, విజయ్, నాగరాజు, లోక్యనాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మీనారాయణ

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మండల కేంద్రమైన చిప్పగిరి లో ఏర్పాటు చేసినట్లు తాసిల్దార్ లక్ష్మి నారాయణ తెలిపారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలం మొత్తానికి గాను గ్రాడియేటర్స్ 497 ఉపాధ్యాయులు 13 ఉన్నాయన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విడివిడిగా రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయించామన్నారు. ఓటును స్వచ్ఛందంగా వేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి, విఆర్వోలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి


సచివాలయం ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్ రాజు

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో సుధాకర్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దేగులపాడు, గ్రామాన్ని ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, మాట్లాడారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, తగు సలహాలు సూచనలు ఇచ్చారు. చెత్త సంపద కేంద్రం ద్వారా, రైతులకు ఉపయోగపడే అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహ, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం పాదచారులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆదోని


పండ్లు వాటర్ ప్యాకెట్ పంపిణీ చేసిన మల్లికార్జున

ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో శివమాల ధారణ పాదచారులకు ఉచితంగా ఫలహారము వాటర్ ప్యాకెట్లను మాజీ కౌన్సిలర్ మల్లికార్జున శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని శివమాల ధారణ చేసిన వారు పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా ఉందన్నారు. పాదయాత్రగా వెళ్లే వారికి సమయానికి నీళ్లు దొరక్క ఆకలితో వెళ్లకుండా తమ వంతు సేవా దృక్పథంతో మూడు రకాల పళ్ళు, బ్రెడ్లు, నీళ్లను పంపిణీని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామన్నారు.

అదాని ఆస్తులు జాతీయం చేయాలి

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ.. సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీ ఆస్తులన్నిటిని ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకొని జాతీయం చేయాలని సీపీఐ మండల కార్యదర్శులు సుదర్శ న్, బసాపురం గోపాల్, ఏఐటీయుసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదానీ ఆస్తులను తక్షణమే జాతీయం చేయాలని, అక్రమ ఆస్తులపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు హుసేని, ప్రకాష్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, అంజిత్ గౌడ్, సిపిఐ నాయకులు కృష్ణమూర్తి, వీరప్ప నాగరాజు, అత్తర్ పాల్గొన్నారు.

దేవనకొండ : ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం పేదల సంక్షేమం మరిచిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎం. నబి రసూల్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. మద్దిలేటి శెట్టి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎస్. కృష్ణయ్యలు ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మండల పరిధిలోని నల్లచెలిమల గ్రామంలో సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎమ్. నరసరావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయం పోస్ట్ ఆఫీసు వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో ఎన్నో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం దేశానికి సంబంధించిన ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే,ఎల్ఐసి, ఎయిర్ పోర్టులు,ఉక్కు కర్మాగారాలు అన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ అంబానీ, ఆదానీలకు సేవ చేస్తుందని వారు పేర్కొన్నారు. ఈమధ్య హిడెన్ బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదిక భారతదేశంలోని డొల్ల కంపెనీల వల్ల దేశానికి జరిగే అన్యాయాలను బయట పెడితే ఆదానిని కాపాడుకునే పనిలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమగ్నమైందని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ శాఖ కార్యదర్శి భూపేష్, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం పత్తికొండ తాలూకా కార్యదర్శి ఎం.కారన్న, కాసిం, మండల నాయకులు రంగస్వామి, నెట్టెకల్లు, వెంకటేశ్వర్లు, నాగరాజు, కిష్టన్న, లక్ష్మన్న, జయన్న, నరేష్, రాజశేఖర్, బజారి, నరసింహులు, పెద్ద రంగన్న తదితరులు పాల్గొన్నారు.



ఆదోనిలో నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు


దేవనకొండ: వినతి పత్రం ఇస్తున్న సిపిఐ నాయకులు

చిన్న వ్యాపారులపై వేధింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చిన్న వ్యాపారులపై పోలీసుల వేధింపులు తగదని సిఐటియు మండల కన్వీనర్ బి రాముడు, పట్టణ నాయకులు ఆంథోనీ పేర్కొన్నారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో చిన్న వ్యాపారాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజక వర్గంలో పరిశ్రమలు లేకపోవడంతో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, ఓసిలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారు వ్యాపారం చేసుకుని తోపుడు బండ్లతో జీవనం కొనసాగిస్తున్నారని, వీరికి జగనన్న తోడు పథకం మొక్కుబడిగా ఐదు శాతం ఇస్తున్నారన్నారు. పోలీసులు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ పేరుతో తూనికలు ఎత్తుకెళ్ళడం, తోపుడు బండి స్టేషన్లో ఉంచడం, జరిమా నా విధించడం వివిధ పేర్లతో కోర్టులో చుట్టూ తిప్పుతు న్నారన్నారు. ఇప్పటికైనా చిన్న వ్యాపారాలపై వేధింపులు మానాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చిన్న వ్యాపారస్తులు సంఘం నాయకులు రవికుమార్, అబ్దుల్లా అనీఫ్, ఆంధ్రయ్య, రజిని, సాగర్, రఘు, పెద్దయ్య, యాకోబు, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు పట్టణ నాయకులు ఆంథోనీ

బురఖా ధరించి చోరీకి యత్నం

అప్రమత్తంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని హవన్నపేటలో బురకా ధరించి ఓ మహిళ చోరీకి యత్నం చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. హవన పేటలో నివాసముంటున్న కామాక్షి ఇంటిలోకి బురక ధరించి మహిళ ఇంట్లోకి వచ్చింది. మీ వివరాలు కావాలని, పేపర్‌పై సంతకం చేస్తే సచివాలయంలో అమౌంట్ ఇస్తారని, కామాక్షిని ఆ మహిళ మాటల్లో దింపింది. తాను చదువుకోలేదని, సంతకం రాదని కామాక్షి చెప్పింది. మీ ఆయన పేరు చెప్పాలని ఖాళీ పేపర్లో వివరాలు రాసుకుంటూ ఉంటూ నటించింది. తాగేందుకు నీరు ఇవ్వాలని అడగ్గా కామాక్షి వంట రూమ్ లోకి ప్రవేశించిన ఆమె వెంట నడిచి కళ్ళల్లో కారం చల్లి బంగారు చైను, కమ్మలు లాక్కెళ్ళి బయటకు పరుగు తీసింది. అక్కడే ఉన్న ఓ వ్యక్తి అడ్డుకోవడంతో బంగారు చైను ,కమ్మ అక్కడే వదిలి ఉడాయించింది. ఘటన విషయం తెలుసుకున్న త్రీ టౌన్ సీఐ శ్రీరామ్ హుటాహుటిన వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. జన సంచారం ఉండే ఇలాంటి వీధుల్లోనే మహిళ ఇంట్లోకి వెళ్లి చోరీకి యత్నం చేసిందంటే పరిస్థితి ఎలా ఉందో గమనించాలని స్థానికులకు అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తుల కదలికలు, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించిన తమకు సమాచారం ఇస్తే వెంటనే ట్రేషౌట్ చేస్తామని శ్రీరామ్ తెలిపారు. పట్టణంలో ఏదో ఒక మూలన చోరీలు, దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. వార్డుల వారీగా ప్రజలను అప్రమత్తం చేసే విధంగా అవగాహన కల్పించాలని పురవాసులు పోలీసులను కోరుతున్నారు.


వివరాలు తెలుసుకున్న సిఐ శ్రీరామ్

పేద ప్రజలపై వైసిపి భారం : కోట్ల

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పథకాల పేరుతో గ్యాస్,నిత్యావసర సరుకులు ఏది పడితే దానిపై రేట్లను అమాంతంగా పెంచి పేద తరగతి ప్రజల కడుపు కొడుతోందని ఆలూరు టీడీపీ ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం ఆలూరు మండలంలోని మనేకుర్తి గ్రామంలో టీడీపీ రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేం ఖర్మ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నవరత్నాల పేరిట పేద ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి మనిషిపై రెండు లక్షలకు పైగా రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేసిందన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అశోక్ యాదవ్, సర్పంచ్ కొల్లమ్మ, నాయకులుమద్దిలేటి, భగవంతు, యంకన్న, శేఖన్న, అల్లప్ప, దేవేంద్ర, రవి,కుమార్, దేవరాజు,హనీఫ్ పాల్గొన్నారు.


నెట్లోఫోటో...మనేకుర్తి గ్రామంలో ఇదేమి కర్మ లో కోట్ల సుజాతమ్మ


మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

పేదల నివాస ప్రాంతాల్లో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంథోని, పట్టణ వైస్ ప్రెసిడెంట్ సుమల రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పట్టణంలో ఎస్సీ కాలనీ, కటికేపేట కమరస్తాన్ ఏరియా చాకలి వీధి నందు 90 శాతం మంది రోజువారి కూలీలేనని, వీరు తరచుగా ఆరోగ్యం బాగాలేక ఇబ్బంది పడుతున్నారని, ఈ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన స్థలం కూడా ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా మేల్కొని ఈ ప్రాంతంలో ప్రజల అనారోగ్య సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఆ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆస్పరి

పెట్రోల్ ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ మండల కేంద్రమైన ములుగుందం గ్రామానికి చెందిన బోయ పశువుల రంగస్వామి (25) శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో మూడు రోజుల పాటు దస్తగిరి స్వామి ఉత్సవాలు జరిగాయి. పశువుల చిన్న లక్ష్మణ, పశువుల శంకరమ్మ చిన్న కుమారుడు ఉరుసు రోజు ఖర్చుకు డబ్బులు ఇవ్వాలని ఇంట్లో గొడవ పడ్డాడు. పండుగ రోజు మద్యం తాగి గొడవ పడుతాడానే ఉద్దేశంతో పెద్దలు డబ్బులు ఇవ్వలేదు. దీంతో రంగస్వామి మనస్తాపం చెంది పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతినికి భార్య చంద్ర కళా, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం స్పందించి రంగస్వామి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ప్రైవేటుకు ధీటుగా, ప్రభుత్వ పాఠశాలలు

- కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ షబానా బేగం

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరుగుతోందని కెజిబివి ప్రిన్సిపల్ షబానా బేగం పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన భోజనం వడ్డించే విధంగా, మెనూ ప్రకారం తయారు చేస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత ధ్యేయంగా విద్యాబోధన జరుగుతుందన్నారు. కార్యక్రమ ంలో క్లర్కు నాగలక్ష్మి, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - గోనెగండ్ల

భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన తెలంగాణకు చెందిన హమారా ప్రసాద్ ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ చిల్లరపనులు చేసే హమారా ప్రసాద్ తన వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకోవడానికి సోషల్ మీడియా వేదికగా అంబేద్కర్ బ్రతికి ఉంటే గాంధీని గాడ్సే చంపినట్లు అంబేద్కర్‌ను తాను చంపేవాడినని బహిరం గంగా ప్రకటించడం రాజ్యాంగాన్ని అవమానిం చడమేనని అన్నారు. వెంటనే అతనిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా జడ్‌పిటిసి ఏరూర్

చంద్రశేఖర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆలూరు



జడ్పీటీసీరి కేక్ కట్ చేస్తున్న నాయకులు, అభిమానులు, తదితరులు

ఆలూరు జడ్పీటిసి ఏరూర్ శేఖర్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో వైసీపీ నాయకులు, కార్యకర్తల నడుమ ఘనంగా నిర్వహించారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బాణా సంచ పేల్చి అభిమానం చాటుకున్నారు. వైస్ సర్పంచ్ భర్త శ్రీదర్,వైస్ ఎంపీపీ రవి మాజీ ఎంపీటీసీ పెట్రోల్ కిషోర్,ఆస్పరి జడ్పీటిసి దొరబాబు,మాజీ ఎంపీటీసీ మోహన్, తహశీల్దార్ మల్లికార్జున, ఏపీవో హేమసుందర్, వలంటీర్లు, ఎంపీటీసీలు నాగమ్మ,జీరగౌడ,కో ఆప్షన్ సభ్యులు బాషా,వైసీపీ నాయకులు శేఖర్ రెడ్డి,పవన్ సీనియర్ నాయకులు లారీ ఉరుకుందప్ప,రాజ్ కోటి,గోవింద్ పాల్గొన్నారు.

వైభవంగా మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి - దేవనకొండ

మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో హజరత్ దివానే మస్తాన్ వలి దర్గా ఉరుసు ఉత్సవం శుక్రవారం దర్గా కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు శ్రీనివాసులు దర్గాను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. దర్గా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామస్తులు మేళ తాళాలతో దర్గాకు దగ్గరకు వెళ్లి పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో మండల జడ్పిటిసి కిట్టు, వైసీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, నాయకులు దివాకర్ నాయుడు, నారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ షేకమ్మ, సచివాలయ కన్వీనర్ బాబు పాల్గొన్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న మస్తాన్ వలి దర్గా

ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

శ్రీ చైతన్య-1 పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ప్రిన్సిపల్ గౌసియా ఖనమ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌసియా ఖనమ్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఆటలతో చదువు ఒత్తిడి పడకుండా కృషితో, చురుకుగా అభ్యసించడం జరుగుతుందన్నారు, ప్రతి ఏడాది మాదిరిగానే ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు తగిన బహుమతులను ప్రధానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్, ఆర్ఐ రంగారెడ్డి, ఏవో అశోక్, ప్రీ ప్రైమరీ ఇన్చార్జి లలిత సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడలు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్

వైసిపిపై ఆరోపణలు నిరాధారమైనవి : వైసిపి

ప్రజాశక్తి - ఆదోని

ముస్లీం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వైసీపీ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నియాజ్ అహ్మద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహబూబ్ బాష ఖండించారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విజయవాడలో తెలుగుదేశం కోవర్టుగా పనిచేస్తున్న ముస్లీం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముస్లింల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ముస్లీంలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు వై జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో ముస్లింలకు డిప్యూటీ సీఎం, మేయర్లతో పాటు నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వక్ఫ్ బోర్డ్ చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు అనేక పదవులు ఇచ్చి ముస్లింలకు పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు బి దేవా, స్టేట్ డైరెక్టర్ మటన్ మస్తాన్, అహ్మద్ బాష, ఆర్టీసీ రహెమాన్, అల్తాఫ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడిన నియాజ్ అహ్మద్

జిల్లా కబడ్డీ జట్టు శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

అండర్ 14 బాలికల విభాగంలో కర్నూలు జిల్లా కబడ్డీ జట్టుకు ఐదు రోజులపాటు జరిగే శిక్షణ శిబిరాన్ని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన కళాశాల ఛైర్మన్ విట్టా సతీష్, కరస్పాండెంట్ ద్వైవాదీనం రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలు ఆయా ప్రాంతాల క్రీడాకారుల మధ్య స్నేహభావాన్ని, ఔన్నత్యాన్ని పెంచుతాయన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే లక్ష్యాలు సాధ్యమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ మెంబర్ సనత్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు హెచ్ఎం వై స్వామి, కంబిరెడ్డి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సోమశేఖర్ రెడ్డి, సెక్రటరీ వినోద్ జైన్, ఇతర రోటరీ క్లబ్ మెంబర్స్, వ్యాయామ ఉపాధ్యాయులు నరసయ్య, ఈరన్న, బిల్లా శ్రీనివాసులు, నరసింహులు, నరసింహ రాజు, షాషావలి హరిబాబు, గోవిందు, సత్యనారాయణ, మస్తాన్, మహబూబ్ బాషా, గంగాధర్, బాలాజీ, బాలు, కార్తీక్, క్యాంపు నిర్వహిస్తున్న కబడ్డీ కోచర్లు హరిత, రామన్న, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గురజాలలో మహాశివరాత్రికి ఏర్పాట్లు

- పనులను పరిశీలించిన సిఐ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

మహాశివరాత్రి సందర్భంగా గ్రామంలో గురజాల శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాట్లను ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్ రెడ్డి పరిశీలించారు. శుక్రవారం గ్రామంలో పర్యటించి దేవాలయం, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రిలో శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగే మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను చేశామన్నారు. అలాగే వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ మళ్లిం పునకు చర్యలు తీసుకోవాలని నందవరం ఎస్సై మహేష్ కుమార్‌కు సూచించారు. ఏ దారిని వచ్చే వాహనాలు అదే దారి పక్కన ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను నిలపాలని, భక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంతంగా మహాశివరాత్రి జరిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరస్వామి పాల్గొన్నారు.


ఏర్పాట్ల పనులను పరిశీలిస్తున్న సిఐ మోహన్ రెడ్డి


మక్కా యాత్రికు పోవారిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

మక్కా యాత్రికులకు బివి సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 33వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్తలు అబ్దుల్లా, షాహీదా, జుబేదా, మైమునా ముస్లిం మైనారిటీల పవిత్ర హజ్ (మక్కా యాత్ర) వెళ్తున్న ముస్లీం సోదరులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి సన్మానించారు. శుక్రవారం వారి స్వగృహానికి వెళ్లి వారిని పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండే విధంగా ప్రజాలందరికోసం దువా చేయాలని కోరారు .

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని నిట్రవట్టి గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వాల్మీకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం గురించి పార్థసారథి మాట్లాడుతూ వాల్మీకులు అంతా ఏకమై అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. ఎస్టీ సర్టిఫికెట్ వచ్చేంతవరకు పోరాడాలని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ వాల్మీకి లీడర్లు ఆలూరు వైసిపి ఇంఛార్జి నారాయణ స్వామి, గుమ్మనూరు సీనప్ప, కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, క్రాంతి నాయుడు హాజర య్యారు. హాలహర్వి మండల కన్వీనర్ బీమప్ప చౌదరి, జడ్పిటిసి లింగప్ప, స్థానిక వాల్మీకి నాయ కులు లక్ష్మణ, సొసైటీ చైర్మన్ సీనప్ప, పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ కింద స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ తహశీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో పిఒఎల్ఆర్ రీ సర్వే, 90 రోజుల ఇళ్ల పట్టాలు, జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం, పౌరసరఫరాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై జెసి టి.నిశాంతితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టాప్-4, టాప్-10లో వున్న సర్వీసులు, జాయింట్ ఖాతా కరెక్షన్స్, ఇళ్ల పట్టాలకు సంబంధించిన భూములు తదితర రెవిన్యూ అంశాల్లో తాసిల్దార్లకు కేటాయించిన పనులపై ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. స్పందన అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాల్సిన సమస్యలపై ఆరా తీస్తూ ఎందుకు పెండింగ్లో ఉన్నాయని మండలాల వారీగా తాసిల్దార్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జాతీయ రహదారులు, ఇళ్ల పట్టాలకు అవసరమైన భూములు, పర్యాటక ప్రదేశాలు, పరిశ్రమలకు అవసరమై పెండింగ్లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి, ఎం.దాసు, అన్ని మండలాల తహశీల్దార్లు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని అడ్డవాగు సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం శీతల పానీయ దుకాణం దగ్ధమైంది. వివరాలు.. పట్టణానికి చెందిన శ్రీనివాసులు స్థానిక అడ్డవాగు వద్ద శీతల పానీయ దుకాణం పెట్టుకొని జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం దుకాణం తెరిచే సమయంలోపే విద్యుత్ ఘాతంతో మొత్తం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఆళ్ళగడ్డ అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల మేర ఆస్థి నష్టం సంభవించింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

విఆర్ఎలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - బేతంచర్ల

గ్రామ రెవెన్యూ సహాయకులకు ఫేస్ యాప్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.నాగేష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల కార్యదర్శి మహేశ్వరమ్మ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు ప్రభుత్వం ప్రస్తుతం నెలకు రూ.10,500 ఇస్తుందని, కానీ ప్రస్తుతం నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల ఈ వేతనం ఏ మూలకు సరిపోవడం లేదన్నారు. ఫేస్ యాప్ పద్ధతిని ప్రభుత్వం ఉపసంహరించుకొని విఆర్ఏలను పర్మినెంట్ ఉద్యోగస్తులుగా గుర్తించాలని కోరారు. ఈనెల 14న విఆర్ఏ సమస్యలపై కలెక్టరేట్ ముందు జరుగు ధర్నాకు అనుమతి కోరుతూ ఆర్ఐ శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో విఆర్ఏలు నాగలక్ష్మి, పుల్లయ్య, లక్ష్మీదేవి, ఎస్‌కె.భాష, నాగరాజు, శ్రీకాంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా సైన్స్ ఫెయిర్‌కి ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - రుద్రవరం

ఆదర్శ పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన 4 ప్రాజెక్ట్లు జిల్లాకి ఎంపికయ్యాయని శుక్ర వారం ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల స్థాయి నుండి జిల్లా స్థాయికి ఐదు అంశాల ప్రాజెక్ట్‌ల నుండి మోడల్ స్కూల్ నుండి 8 మంది ఎంపిక అయ్యారన్నారు. ఈ నెల 14న జరగబోయే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, సతీష్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు



డోన్ పట్టణంలో మార్చి 6, 7, 8వ తేదీల్లో జరుగు ఎస్ఎఫ్ఐ జిల్లా 3వ మహాసభను జయప్రదం చేయాలని నందికొట్కూరు నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు డక్క కుమార్, శివలు కోరారు. ఎస్ఎఫ్ఐ మహాసభ కరపత్రాలను ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, శ్రీ సాయిరాం విద్యా సంస్థల చైర్మన్ సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజవర్గంలో ఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటం చేస్తూ, విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. డోన్‌లో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు హరి వర్ధన్, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- వ్యకాసం, సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - నందికొట్కూరు

మున్సిపల్ కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సునీతపై చర్యలు తీసుకొని, వెంటనే బదిలీ చేయాలని వ్యకాసం జిల్లా నాయకులు పి పకీర్ సాహెబ్, సిఐటియు టౌన్ కార్యదర్శి టి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి పారిశుధ్య కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సన్నిహితంగా ఉండి పని చేస్తున్నారని, కొత్తగా వచ్చిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం సునీత ఎక్కడా లేని నిబంధనలు పెట్టి కార్మికులను మానసిక ఒత్తిడికి గురి చేస్తుందన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇబ్బంది కలిగించే ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి, పిఎఫ్ బకాయిలను చెల్లించాలని, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు టౌన్ అధ్యక్షురాలు జయ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరమేష్, భాస్కర్, నాగేశ్వరరావు, ప్రతాప్, దాసు, ప్రదీప్, శ్రీనివాసులు, నాగమ్మ, భాగ్యలక్ష్మి, సుశాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెస్ బిల్లులు పెంచాలి

- విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్

- కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో విద్యార్థులు నిరసన

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచి, హాస్టళ్ల మరమ్మతులకు , మెయింటెనెన్సుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్వీఎఫ్), ఏఐవైఎల్, ఏఐఎఫ్‌బి సంఘాల ఆధ్వరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్వీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని రాజునాయుడు, ఏఐవైఎల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాథ్, ఆర్వీఎఫ్ జిల్లా అధ్యక్షులు బత్తిని ప్రతాప్, ఏఐఎఫ్‌బి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం వెంకటాద్రి, కేజే. శ్రీనివాసరావు, బాలకృష్ణానాయక్‌లు మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగునంగా ప్రీమెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు నెలకు ప్రభుత్వం ఇచ్చే రూ.1250 నుండి రూ.2500 పెంచాలని, కాలేజీ హాస్టల్ విద్యార్థికి రూ.1400 నుండి రూ. 3 వేల వరకు పెంచాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల వారెన్లు విద్యార్థులకు అందుబాటులో స్థానికంగా ఉండాలని కోరారు. ధర్నా కార్యక్రమానికి స్పందించిన అధికారులు, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి (డీఎస్సీడబ్యూఓ) చింతామణి సమస్యలను ఆరా తీశారు. ఈ సందర్భంగా నేతలు పలు సమస్యలు వివరించి చింతామణికి వినతిపత్రాన్ని అందజేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి, మెస్ చార్జీల పెంపునకు మార్చి 6న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నేతలు తెలిపారు.

మొదలైన ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి

- జిల్లాలో ఎన్నికల నియమావళి అమలు

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కడప, అనంతపురం, కర్నూలు పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిల పదవీకాలం మార్చి 29తో ముగియనుండడంతో ఆ స్థానలకు కేంద్ర ఎన్నికల కమిషన్ గురువారం షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 16న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి మొదలైంది. ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో జిల్లా అధికార యంత్రాంగం బిజీ బిజీగా ఉంది. ఇప్పటికే ఉపాధ్యాయ, పట్టభద్రుల సంబంధించి జిల్లాలో ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రావడంతో అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేక్ పడనుంది. జిల్లాలో 54,803 పట్టభద్రుల ఓటర్లు,ఉపాధ్యాయ ఓటర్లు 4,402 మంది ఉన్నారు. అందులో పట్టభద్రుల ఓటర్లకు సంబంధించి 38,607 పురుషులు, 16,192 మంది మహిళలు, ఇతరులు 4 ఉన్నారు. ఉపాధ్యాయ ఓటర్లకు సంబంధించి 2,785 మంది పురుషులు, మహిళలు 1,616 మంది ఉన్నారు. వీరందరూ మార్చి 13న జరిగే పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

చేతి పంపులకు మరమ్మతులు

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండలంలోని కోటపాడు గ్రామంలో ఇటీవల మరమ్మతులకు గురైన చేతి పంపులకు రిపేరీ చేయించి వినియోగంలోకి తెచ్చినట్లు సర్పంచ్ డి.హుసేన్ బి గుర్రప్ప శుక్రవారం తెలిపారు. సర్పంచి మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో ఉన్న చేతి పంపులు తుప్పు పట్టి నీరు అందక వృధాగా పడి ఉన్న పరిస్థితిని స్థానిక ఎంపిడిఒ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ దృష్టికి తీసుకెళ్లామన్నారు. పైపులను వెలికి తీసి నూతన మెటీరియల్‌తో పాటు పైపులను అమర్చామని తెలిపారు. కోటపాడు గ్రామాన్ని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, వైసిపి సీనియర్ నేత వంకదార పెద్ద సుబ్బ సత్యనారాయణ సహాయ సహకారాలతో ప్రగతి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు.

మాజీ సర్పంచి బాల సుబ్బయ్య మృతి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని పెద్దదేవళాపురం గ్రామ మాజీ సర్పంచ్ బాలసుబ్బయ్య(78) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళ్లులర్పించారు. బాలసుబ్బయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట నాయకులు కంచర్ల సురేష్ రెడ్డి, తాటికొండ బుగ్గరాముడు, కంచర్ల మనోహన్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

బీమా కుటుంబాలకు కొండంత అండ

ప్రజాశక్తి బేతంచెర్ల

స్టేట్ బ్యాంకులో బీమా నమోదు చేసుకోవడం వల్ల కుటుంబాలకు ఆపద సమయంలో కొండంత అండగా ఉంటుందని బేతంచెర్ల స్టేట్ బ్యాంక్ మేనేజర్ సిహెచ్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం బేతంచెర్ల మండలంలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన ఆల మద్దిలేటి బ్యాంకు ఖాతాదారుడై మరణించడంతో భీమాలో భాగంగా మంజూరయిన రూ.10 లక్షలు మృతుడి భార్య దేవిశెట్టి మౌనికకు అందజేశారు.

ఘనంగా టెక్కె స్వామి ఉరుసు

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని ఎర్రమల కొండల్లో వెలసిన టెక్కె స్వామి ఉరుసు మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలను తిలకించేందుకు జిల్లాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బనగానపల్లె ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. భక్తులకు గ్రామానికి చెందిన గూడాల సోదరులు మురళీధర్ రెడ్డి, ప్రతాపరెడ్డిలు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అల్లర్లు జరగకుండా ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న గూడాల సోదరులు

రాజ్యాధికారానికి బహుజనులంతా ఏకం కావాలి

ప్రజాశక్తి - పాములపాడు

రాజ్యాధికారానికి బహుజనులంతా ఏకం కావాలని బీఎస్పీ పార్టీ నందికొట్కూరు ఇన్చార్జి స్వాములు కోరారు. శుక్రవారం పాములపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ నందు బహుజన రాజ్యాధికార చైతన్య కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులు రాజ్యాంగ బద్ధంగా రాజ్యాధికారానికి రావడానికి ఏకం కావలసిన అవసరం ఉందన్నారు. ఈనెల 15వ తేదీన నంద్యాల పట్టణంలో జరుగు బహుజన రాజ్యాధికార యాత్రను జయప్రదం చేయడానికి వేలాదిగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో గోవిందరాజు, చిట్టిబాబు, లాజరేసు, కృపాకర్, పకీరయ్య, మహేష్, ఏసన్న, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీమ అభివృద్ధి సిఎంతోనే సాధ్యం

- వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాయలసీమ సమగ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక కోర్టు ప్రాంగణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బార్ అసోసియేషన్ సభ్యులను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను వైసిపి మద్దతుతో బరిలో ఉన్నానని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. ప్రచారంలో ఆళ్లగడ్డ నియోజకవర్గం ప్రచారకర్త సిరిగిరి రామిరెడ్డి, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్ శ్రీనాథ్ రెడ్డి, అశ్వర్థరెడ్డి, నాగేశ్వర రెడ్డి, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్ వనజాక్షిని సస్పెండ్ చేయాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

మెనూ సక్రమంగా అమలు చేయకుండా విద్యార్థులను అర్ధాకలితో కడుపులు మాడుస్తున్న బనగానపల్లె ప్రీ మెట్రిక్ బాలికల హాస్టల్ వార్డెన్ వనజాక్షిని వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి నిర్లక్ష్యం వీడి హాస్టల్ వార్డెన్ వనజాక్షిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో డిడి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేంద్ర, నాయకులు రఫీ, అనిల్ కుమార్, వెంకట్, రమణ, శీలన్న తదితరులు పాల్గొన్నారు.

సామాజిక దృక్పథంతో పని చేసే వారిని గెలిపించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

సామాజిక దృక్పథంతో పని చేసే వారిని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డా. సందే మాధవరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, అవుకు మండలం, కొలిమిగుండ్ల మండలం, కోయిలకుంట్ల మండలం, సంజాముల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మోడల్ స్కూల్ కస్తూరిబా పాఠశాలలలో, ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలో బహుజన ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ సందే మాధవరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను, అధ్యాపకులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు ఉపాధ్యాయులు, బీసీ ఉద్యోగుల నాయకులు పాల్గొన్నారు.

21 నుంచి మానవత నైతికతపై సదస్సులు

ప్రజాశక్తి - బనగానపల్లె

జమతే ఇస్లామీ హిందూ ఆధ్వర్యంలో మానవతా నైతికతపై ఈ నెల 21 నుంచి సదస్సులను నిర్వహిస్తున్నట్లు జమతే ఇస్లామిక్ హిందూ అధ్యక్షులు షబ్బీర్ భాష పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో మానవతా నైతికత పోస్టర్లను జమతే ఇస్లామిక్ హిందూ నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామిక్ హింద్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో రాణించండి

- జిల్లా క్రీడా శాఖ ఇసిఒ రమణ

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

క్రీడా స్ఫూర్తిని కనబరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ అన్నారు. శుక్రవారం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సిఇఒ రమణ మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 13 వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రధాన శిక్షకులు నటరాజరావు, జిల్లా ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్, షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, కబడ్డీ శిక్షకులు భూపతిరావు, షూటింగ్ బాల్ సంఘం ప్రతినిధులు నరేష్, నాగరాజు, డిఎస్‌పి సూపరిన్‌టెండెంట్ శేషుపని, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవి ప్రకాష్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో సిఇఒ రమణ


పొదుపు మహిళాగ్రూపులకు అవగాహన

ప్రజాశక్తి-గూడూరు

కోడుమూరు మండలంలో మండల సమాఖ్య సమావేశపు హాల్‌లో శుక్రవారం జీవనోపాధులలో భాగంగా PMFME(HOE) స్కీం ద్వారా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పథక సంచాలకులు డిఆర్‌డిఎ-వైకెపి ఎం.వెంకట సుబ్బయ్య , పిడి ఎపిఎంఐపి ఉమాదేవి సమావేశంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.

ఉల్లి , టొమాటో, క్యారెట్ తదితర వాటిని కట్ చేసి సోలార్ డ్రయ్యర్స్ ద్వారా ఎండబెట్టి ప్యాకింగ్ చేసిన వాటిని ఎపి ఫుడ్ ప్రాసెస్సింగ్ సొసైటీ ద్వార మార్కెటింగ్ చేయడం తద్వారా ప్రతి మహిళ ఆదాయం పొందవచ్చని, ప్రతి సోలార్ డ్రయ్యర్స్ యూనిట్ ధర రూ 90000 బ్యాంక్ ద్వారా లోన్ రూపంలో మంజూరు చేస్తామన్నారు. ఇందులో రూ.35000 సబ్సిడీ రూపంలో ప్రతి మహిళకు లబ్ధి చేకూరుతుందన్నారు. తదనుగుణంగా మండలంలో 100 యూనిట్లకు తగ్గకుండా సోలార్ డ్రయ్యర్స్‌ను గ్రౌండింగ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ లీడ్ మేనేజర్ సుభాష్, డిపిఎం లైవ్లీహుడ్స్ నర్సమ్మ, ఎపిజిబి మేనేజర్, ఎపిఎం పుష్పవతి సిసిలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రాని కేంద్రం మొండిచేయి : సిపిఐ



వెల్దుర్తిలో సిఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-వెల్దుర్తి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేసిన, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, దేశ సంపదను అంబానీ, ఆదానీలకు దోచిపెడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగావెల్దుర్తి ఎస్‌బిఐ బ్యాంక్ ఎదుట సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి టి.కృష్ణ అంబానీ, ఆదానీలకు ఊడిగం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. పట్టణ కార్యదర్శి గిరి, సిపిఐ సహాయ కార్యదర్శి డి.రాజు, చిన్న వ్యాపారస్తుల సంఘం రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, మండల నాయకులు అనీల్, ఎల్లప్ప, చిలిపి కృష్ణ,ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

తుగ్గలి: జాతీయ ఉపాధి హామీ పథకంను కేంద్రం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్ అన్నారు. శుక్రవారం సిపిఐ రాష్ట్ర పిలుపు మేరకు తుగ్గలి తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అదాని ఆస్తులను కాపాడే విధంగా కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కేవలం అదానీ ఆస్తులను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. దేశంలో ఉన్నటువంటి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరు గారిచే విధంగా లక్ష కోట్లు ఉన్నటువంటి ఉపాధి హామీ పథకం పనిని రూ. 35 కోట్లకు తెచ్చారన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశు, పీరా, బాబా ఫక్రుద్దీన్, ఇబ్రహీం, మున్నూరు వలి, నూర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి పదోన్నతి అర్హత పరీక్ష

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న 80 మంది ఎంటిలు, ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 కేడర్‌ల నుండి ఎన్ఎఫ్ఎఎస్, అకాడమీ, ఎంటిఎస్ కోసం మెంటర్లు కోసం కర్నూలు మధురానగర్ ప్రకృతి వ్యవసాయ సమావేశపు హాల్లో శుక్రవారం పదోన్నతి అర్హతా పరీక్ష నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. రైతు సాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ పదోన్నతి అర్హత పరీక్షలను ఎస్‌పిఎంయు థీమ్యాటిక్ సురేష్ బాబు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బాబ్జీ, చంద్రశేఖర్, జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందీప్ కుమార్, డిపిఎంయు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నిరసన దీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లింపులో జాప్యం చేయడానికి నిరసిస్తూ శనివారం కర్నూలులో నిరసన దీక్ష చేపడుతున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్ మరియానందం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలులోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లో నిరసన దీక్షను ఎపిటిఎఫ్ నాయకులతోపాటు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ చామల అనిల్ వెంకటసుబ్బారెడ్డి పాల్గొంటారన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ శనివారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమీక్షలో ప్రధానంగా నోడల్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేయనున్నారు.

ఆర్టీసీ బస్సులను నడపడంపై హర్షం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాజ్ విహార్ సెంటర్ మీదుగా ఆర్‌టిసి బస్సులను నడిపేందుకు జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకోవడం పట్ల డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులను నడపడం అభినందనీయమన్నారు.



మారుతీ చౌదరిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

కళ్యాణదుర్గంలో ఉద్రిక్తత

- మంత్రి ఉషశ్రీ అవినీతికి సంబంధించిన ఆధారాలు బయటపెడతామన్న టిడిపి నాయకులు
- పలువురు నేతలను అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఉద్రిక్తత నెలకొంది. కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్ భూ కబ్జాలకు సంబంధించిన అవినీతి ఆరోపణలన్నీ తమ వద్ద ఉన్నాయని, వాటిని బయటపెడతామని టిడిపి మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కుమారుడి మారుతి చౌదరి గురువారం ప్రకటించారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుకోకుండా గురువారం రాత్రి నుంచే పికెటింగ్ నిర్వహించారు. ఎటువంటి నిరసనలూ తెలియజేసేందుకు వీల్లేందని ఆదేశాలు జారీ చేశారు. పలువురు ముఖ్యనేతలను గృహ నిర్బంధం చేశారు. భూ కబ్జాలకు సంబంధించిన పేపర్లను తీసుకుని శుక్రవారం ఉదయం కళ్యాణదుర్గం టీ సర్కిల్ వద్దకు తన అనుచరులతో కలిసి మారుతి చౌదరి వచ్చారు. పోలీసులు ఆయనను బలవంతంగా అరెస్ట్ చేసి, స్టేషన్‌కి తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. మంత్రి అవినీతిని ప్రజలకు కచ్చితంగా తెలియజేస్తామంటూ మారుతీచౌదరి తెలిపారు.



'స్వచ్ఛ సంకల్పం' అట్టర్ ప్లాప్

- మూలకుపడ్డ వాహనాలు
- ప్రజాధనం దుర్వినియోగం
- పట్టణంలో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- మూడు నెలలుగా జీతాలు లేక క్లాప్ డ్రైవర్లు విలవిల

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మెహన్ రెడ్డి ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన స్వచ్ఛ సంకల్పం క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ నంద్యాల పట్టణంలో అట్టర్ ప్లాప్ అయింది. పట్టణాలను, గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో వీధి వీధికు తిరిగి చెత్తను సేకరించేందుకు రెడ్డి ఎంటర్ ప్రైజెస్ ఏజెన్సీకి అప్పగించింది. ఈ ఏజెన్సీ నిర్వహణ సరిగ్గా ఉండటం లేదని విమర్శలు వస్తున్నాయి. నెలలు గడుస్తున్నా క్లాప్ వాహన డ్రైవర్లకు జీతాలు ఇవ్వడం లేదు. ఇచ్చే జీతాలలో కూడా 3 వేల రూపాయలు కోత విధిస్తుండడంతో డ్రైవర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నంద్యాల పట్టణంలో చెత్తను సేకరించినందుకు క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో 32 వాహనాలను కేటాయించారు. అందులో 12 వాహనాలు మాత్రమే వీధుల్లో తిరుగుతూ చెత్తను సేకరిస్తున్నాయి. మరికొన్ని మరమ్మతులకు గురి కావడంతో పక్కన పెట్టేశారు. నెలలు గడుస్తున్నా వాటిని రిపేర్ చేయకపోవడంతో మూలనపడ్డాయి.. చిన్న చిన్న రిపేర్లను కూడా చేయించలేని పరిస్థితిలో అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులు ఉండడంతో లక్షల రూపాయలు ప్రజాధనం వృధా అవుతోంది. ఒక్కొక్క క్లాప్ వాహనం లక్ష రూపాయలు అనుకున్నా 20 వాహనాలకు 20 లక్షల రూపాయలు వృధాగా పక్కన పడేశారనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. క్లాప్ డ్రైవర్లకు గత సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ జీతాలు రాకపోవడంతో వాహనాలను నిలిపేసి దాదాపు



వారం రోజులపాటు ఆందోళన చేశారు. ఫలితంగా అప్పట్లో రెండు నెలల జీతాలు క్లాప్ డ్రైవర్లకు ఇచ్చారు. మళ్లీ మూడు నెలల పాటు ఇప్పుడు పెండింగ్‌లో పెట్టారు. దీంతో నంద్యాల పట్టణంలోని 12 క్లాప్ వాహనాల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల నుండి జీతాలు వేయకుంటే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం మున్సిపల్ అధికారుల దృష్టికి డ్రైవర్లు తీసుకెళ్లగా సంబంధం లేదని, ఏజెన్సీకి సంబంధించిన వాళ్లే జీతాలు ఇవ్వాలని పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చెత్తను సేకరించే వాహనాలు పట్టణంలో తిరగకపోవడంతో చెత్త ఎక్కడికక్కడ పేరుకపోవడంతో పాటు, డ్రైనేజీ కూడా అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో పట్టణంలో దోమల బెడద ఎక్కువైంది. దోమల నివారణకు పాంగింగ్ కూడా శానిటేషన్ అధికారులు చేపట్టడం లేదు. సాయంత్రం అయితే చాలు ప్రజల రక్తాన్ని తోడేస్తున్నాయి. దోమలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. టైపాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి క్లాప్ వాహనాలు వార్డులో రెగ్యులర్‌గా తిరిగి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

డ్రైవర్లకు జీతాలు చెల్లించకుంటే మళ్లీ ఉద్యమిస్తాం



నంద్యాల పట్టణంలో రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ వారు చాలా విఫలం చెందారు. డ్రైవర్లకు రెగ్యులర్‌గా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. పిఎఫ్, ఈఎస్ఐ ఇంతవరకు అమలు చేయలేదు. చెడిపోయిన వాహనాలను రిపేర్ చేయించే పరిస్థితి లేదు. డ్రైవర్ల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో చెత్త సేకరణ జరగక పేరుకుపోతోంది. డ్రైవర్లకు జీతాలు చెల్లించకుంటే మరోసారి ఉద్యమంలోకి వెళ్ళక తప్పదు.

- దర్శనం లక్ష్మణ్, సిఐటియు పట్టణ అధ్యక్షులు.

పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలి



క్లాప్ వాహనంతో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తూ వీధులను పరిశుభ్రంగా ఉంచుతున్నాం. మాకు మూడు నెలలైనా జీతాలు ఇవ్వడం లేదు. పెండింగ్ పెడుతున్నారు. అడిగితే ఇస్తామని కాలయాపన చేస్తున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. నిర్వాహకులు మాత్రం ఇటు వైపు వచ్చి చూడటం లేదు.. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలి.. లేకుంటే క్లాప్ వాహనాలను బయటకు తీయం.

- షేక్ ఇమ్రాన్ క్లాప్ డ్రైవర్.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ

- నియమావళిని కచ్చితంగా అమలు పరచండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పకడ్బందీ నిర్వహణకు పక్కా ప్రణాళిక రూపొందించుకుని అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆర్డీఓలు, తాసిల్దార్లు, ఎన్నికల నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పటిష్ట నిర్వహణపై జెసి టి.నిశాంతితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 641 క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్లను వెంటనే పరిశీలించి ఓటర్ల జాబితాలో పొందుపరచాలన్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేషన్, అర్హత లేని వారుంటే వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు పరిచేందుకు ప్రతి మండలంలో ఎంసిసి టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుండి సిబ్బంది వివరాలు తెప్పించుకొని ఎన్నికల విధులు కేటాయించేందుకు ప్రణాళిక రూపొందించాలని ఖజానా శాఖ డిడి, కలెక్టరేట్ ఏఓను ఆదేశించారు. పోలింగ్ సరళిపై సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అన్ని మౌలిక వసతులపై పరిశీలించాలని చెప్పారు. స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్, సూక్ష్మ పరిశీలకులను నియమించాలన్నారు. మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో నిర్వహించిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని సూచించారు.

23 నుండి శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ఈ నెల 23వ తేదీ నుండి శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రబీ సాగుకు గాను నంద్యాల జిల్లాలో శనగలు 25 మండలాల్లో 1,16,971 ఎకరాలలో 31,924 మంది రైతులు పంట నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. శనగ పంట 3,06,983.59 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా శనగలు ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.5,335తో కొనుగోలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ-క్రాప్, ఈకెవైసి చేయించుకున్న రైతులు ఈ నెల 13వ తేదీ నుండి రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

పోతుల నాగరాజును ,కత్తి నరసింహారెడ్డిని గెలిపించండి

- ప్రజాసంఘాల నాయకులు ప్రచారం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని సిఐటియు జిల్లా నాయకులు ఏ.రణధీర్, పట్టణ కార్యదర్శిడి. రామ్ నాయక్, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘురాముడు యాదవ్, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శివకృష్ణలు కోరారు. శుక్రవారం పట్టణంలోని సుదర్శన వర్మ భవన్‌లో పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోతుల నాగరాజు, కత్తి నరసింహా రెడ్డిలు నిరంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, నిరుద్యోగ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ బడుగు, బలహీన వర్గాల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నారని, ఇటువంటి వారిని గెలిపించుకోవాల్సిన అవసరం సమాజానికి ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా నాయకులు ఎన్ స్వాములు, సిఐటియు పట్టణ నాయకులు ఫైక్ ఇస్మాయిల్, సురేంద్ర, గణపతి, కెవిపిఎస్ జిల్లా నాయకులు సంపత్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు ఎన్.మంజుల, కార్యదర్శి ఎన్ హరిత, నాయకురాలు ప్రమీల, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ యూనియన్ నాయకులు ప్రసాద్, ప్రసాద్, సిపిఐ నాయకులు అస్లాం, రాజేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని ప్రచారం : ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలని కోరుతూ ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బ్రహ్మోత్సవాలకు శ్రీశైలం ముస్తాబు

- నేటి నుండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - శ్రీశైలం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైల క్షేత్రం ముస్తాబయింది. విద్యుత్ దీపాలు, ఆహ్వాన తోరణాలతో క్షేత్రం కళకళలాడుతోంది. బ్రహ్మోత్సవాలలో స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం పలు రకాల ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివ దీక్ష శిబిరాలు, గంగా సదన్ వెనుక భాగం, టోల్ గేట్స్ సమీపంలో బసవ వనం, బాల గణేష్ వనం, రుద్రాక్ష వనం, మల్లమ్మ కన్నీరు, సాక్షి గణపతి, అన్నదాన భవనం, కళ్యాణకట్ట, చండీశ్వర సదనం తదితర ప్రాంతాలలో భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్ళను ఏర్పాటు చేశారు. దర్శనానికి ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం, కంకణాలు ధరించిన భక్తులకు ప్రత్యేకంగా మరో ప్రత్యేక క్యూ లైన్ ద్వారా అనుమతించనున్నారు. భక్తుల రద్దీ కారణంగా నేటి నుండి 21వ తేదీ వరకు అలంకార దర్శనం ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా శివ స్వాములకు ప్రత్యేక కొన్ని సమయాల్లో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. చంద్రావతి కళ్యాణమండపం నుండి స్వామి శివ స్వాములకు ప్రత్యేక క్యూ లైన్, ప్రత్యేక అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉచితంగా దర్శించుకున్న వారికి 14 కంపార్ట్మెంట్లు, ఇందులో 8 శీఘ్ర దర్శనం కోసం కేటాయించారు. దర్శనం టికెట్లు ఆన్లైన్ ద్వారా పొందేందుకు శీఘ్ర రూ.200 రోజుకు 5000, అతి శీఘ్ర రూ.



రూ.500 టికెట్లు రోజుకు 2000 అందుబాటులో ఉంచారు. ఆన్లైన్ ద్వారా టికెట్లు పొందిన భక్తులకు తెల్లవారుజామున 4 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు, సాయంత్రం 5:30 నుండి రాత్రి 11 గంటల వరకు అనుమతిస్తారు. జ్యోతిర్ముడిని సమర్పించుకునేందుకు పాతాళంగా మార్గంలోని శివదీక్ష శిబిరాలలో తగిన ఏర్పాట్లు చేశారు. 30 లక్షల లడ్డూలను 15 కౌంటర్ల ద్వారా అందించనున్నారు. పాతాళ గంగ, ఆర్టిసి బస్టాండు, కళ్యాణకట్ట తదితర ప్రాంతాల్లో జల్లు స్నానం ఏర్పాటు చేశారు. రింగ్ రోడ్డు వద్ద ఎపిఎస్ఆర్టీసీ, కర్ణాటక ఆర్టీసీ, తెలంగాణ ఆర్టీసీ బస్సు పార్కింగ్ చేసుకునేందుకు వీలు కల్పించారు. అదనంగా 3 వేల వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. క్షేత్ర పరిధిలో 750 మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. క్షేత్ర పరిధిలో పలుచోట్ల స్వాగత తోరణాలు, సూచిక బోర్డులను, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 8 ఎల్ఈడి టీవీలను అందుబాటులో ఉంచారు. 12 పిటిజెడ్ కెమెరాలు, 30 డ్రోమ్ కెమెరాలు, 372 బుల్లెట్ కెమెరాలు, రెండు ఫుట్‌బాల్ కెమెరాలు, మూడు వెహికల్ డిటెక్ట్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

నేటి నుండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు : ఇఒ

శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా నేటి నుండి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లడుతూ 11వ తేదీ ఉదయం 8:48 నిమిషాలకు యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ధ్వజారోహణ కార్యక్రమం ఉంటుటందని చెప్పారు. 12న భృంగి వాహన సేవ, 13న హంస వాహన సేవ, 14న మయూర వాహన సేవ, 15న రావణ వాహన సేవ, 16న పుష్ప పల్లకి సేవ, 17న గజవాహన సేవ, 18 మహాశివరాత్రి ఉత్సవం నంది వాహన సేవ, లింగోద్భవ కాల మహన్యాస పూర్వక రుద్రభిషేకం, పాగాలంకరణ, స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవ కళ్యాణం, 19న రథోత్సవం, తెప్పోత్సవం, 20న యాగ పూర్ణాహుతి ధ్వజావరోహణ, 21న అశ్వ వాహన సేవ, పుష్ప ఉత్సవం, శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.



రాకెట్ లాచింగ్ సెంటర్ నమూనాను తిలకిస్తున్న దృశ్యం

ఎస్‌డిఆర్‌లో ఇన్నోవేటివ్ వరల్డ్ సైన్స్ ఫేర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలోని ఎస్‌డిఆర్ పాఠశాల ప్రాంగణంలో ఇన్నోవేటివ్ వరల్డ్ సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఇన్నోవేటివ్ వరల్డ్ సైన్స్ ఫేర్‌లో విద్యార్థులు రకరకాల ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. ప్రదర్శనలను తల్లిదండ్రులు, ఇతర పాఠశాల విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సహదేవుడు విచ్చేసి విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులు వివరించిన విధానాన్ని ప్రసంశిస్తూ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని కొనియాడారు. విద్యార్థులు ప్రదర్శించిన రాకెట్ లాచింగ్ సెంటర్ నమూనాను చూసి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

'అప్పర్‌భద్ర' పనులు నిలిపివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం వల్ల రాయలసీమ ఎడారిగా మారుతుందని, వెంటనే పనులు నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరులోని సిపిఎం కార్యాలయంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి వెంకటేశ్వర్లు, పి ఫకీర్ సాహెబ్ తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తేప్పర్ భద్ర ప్రాజెక్టుకు నికర జలాలు లేనప్పటికీ మోడీ ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి బడ్జెట్లో 5300 కోట్లు కేటాయించడం రాయలసీమ ప్రజల గొంతు కోయడం తప్ప మరొకటి కాదన్నారు. సిద్దేశ్వరం వద్ద రోడ్డు కం బ్యారేజీ నిర్మించాలని, గుండ్రేవుల ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు నాయకులు కె.మదిలేటి తదితరులు పాల్గొన్నారు.



కల్లు దుకాణంలో బాంబు పేలుడు..!

- దుకాణం యజమానితో పాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలు - భయాందోళనలో గ్రామస్తులు
- అది బాంబు కాదు జంతవులను వేటాడే మందుగుండు సామాగ్రిగా పోలీసుల అనుమానం

ప్రజాశక్తి - రుద్రవరం

ఓ కల్లు దుకాణంలో బాండు పేలడంతో దుకాణం యజమానితో పాటు కల్లు తాగేందుకు వచ్చిన మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో శుక్రవారం ఉదయం కల్లు దుకాణంలో బాంబు పేలిందన్న సమాచారం గ్రామంలో దావాణంలా వ్యాపించడంతో గ్రామమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ సంఘటనతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఎటువంటి ప్రాణాపాయం లేనందున గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

స్థానకుల వివరాల ప్రకారం.... రుద్రవరం గ్రామానికి చెందిన ఈడిగ పుల్లయ్య ఆలమూరులో కల్లు దుకాణం నిర్వహిస్తున్నారు. తన స్వగ్రామం నుండి రోజు ఉదయాన్నే వచ్చి గ్రామంలో కళ్ళు విక్రయించి రాత్రి తిరిగి స్వగ్రామం చేరుకునేవాడు. శుక్రవారం ఉదయం ఉదయం 10:30 నుండి 11 గంటల సమయం మధ్యలో ఉన్నట్లుండి కాళ్ళ కింద బాంబు పేలింది. బాంబు పేలిన ఘటనలో దుకాణం యజమాని పుల్లయ్యతోపాటు ఆలమూరు గ్రామానికి చెందిన ఎల్లయ్య, బాష, ఆళ్లగడ్డ మండలం [illegible] గ్రామానికి చెందిన మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారన్నారు. గాయపడిన వారిని [illegible] పిహెచ్‌సికి తరలించి సంఘటన సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. సిరివెళ్ల సిఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ నిరంజన్ రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మందుగుండు సామాగ్రిగా ఎస్ఐ అనుమానం

జంతువులను వేటాడేందుకు ఉపయోగించే మందు గుండు సామాగ్రి అయి ఉంటుందని ఎస్ నిరంజన్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. దుకాణంలోని మట్టికుండలో ఉంచిన మందు గుండు సామాగ్రి పేలడంతో దుకాణం యజమాని పుల్లయ్యతో పాటు గ్రామానికి చెందిన ఎల్లయ్య, బాషాలు గాయపడ్డారని అనుకుంటున్నారు. ఇది ఎవరైనా కావాలని చేసి ఉంటారా లేక ఆకతాయిల పనా అన్న కోణాలలో దర్యాప్తు చేపడతామని ఎస్ఐ తెలిపారు. దుకాణంలో పేలుడుకు సంబంధించిన ఆనవాళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపామని వివరించారు.



ఎస్ఐని సస్పెండ్ చేయాలని గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

నెల్లూరు ఎస్ఐని సస్పెండ్ చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు డి రాకేష్‌పై చేయి చేసుకున్న నెల్లూరు ఎస్సై అనిల్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసనగా ధర్నా నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ యువ గళం పాదయాత్రకు విశేష స్పందన లభిస్తుండడంతో జీర్ణించుకోలేక వైసిపి నాయకులు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అడ్డుకునేందుకు అడుగడుగునా ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కష్ణా నాయక్, పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, వాణిజ్య విభాగం నియోజకవర్గం అధ్యక్షులు రేగటి నాగిరెడ్డి, నియోజకవర్గం ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు టిప్ టాప్ కలాం, బొబ్బల రామ మద్దిలేటి రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తలారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు

సంక్షేమ పథకాలను అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్రవారం అవుకు పట్టణంలోని సిబిఆర్ కాంప్లెక్స్‌లో వైసిపి గృహ సారథులకు, వాలంటీర్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలులో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. ఇప్పటినుంచి జరిగే ప్రతి ఎన్నికలలో వైసిపిని అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి పెద్ద కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, సోదరులు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, చల్లా విజయభాస్కర్ రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, వైసిపి జిల్లా ఇన్చార్జి రామ సుబ్బారెడ్డి, అవుకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి, మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యువ నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పాములపాడు

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ ఎర్రన్న సూచించారు. శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఇస్కాల, లింగాల గ్రామాలలో ఉన్న పాఠశాలల విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మాదకద్రవ్యాల వలన వచ్చే నష్టాలు తెలియపరిచారు. వాటికి దూరంగా ఉండటం వలన భవిష్యత్తులో మంచి జీవితం ఉంటుందన్నారు. క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రసూల్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న

జెఇఇలో న్యూక్లియస్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జెఈఈ మెయిన్స్ ఫలితాలలో న్యూక్లియస్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులు ఎం.సతీశ్వర్ యాదవ్ 99.30 శాతం, ఏ.గాయత్రి (94.3 శాతం)లను ప్రిన్సిపల్ ఎస్.మురళీధర్ రెడ్డి అభినందించి మాట్లాడారు. లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించి దూర ప్రాంతాల విద్యా సంస్థలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా న్యూక్లియస్ కాలేజ్ యాజమాన్యం జేఈఈ, నీట్ శిక్షణలో అపారమైన అనుభవం గల అధ్యాపకుల చేత శిక్షణను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అద్భుత ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. 2022లో న్యూక్లియస్ విద్యార్థులు మహిరా, మహమ్మద్, అనీష్‌లు శాంతిరాం మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీట్లు సాధించారని చెప్పారు. వీరితోపాటు మనీషా బాయి శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్, తిరుపతిలో సీటు సాధించినట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ ఎన్వి.వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అత్యుత్తమ జాతీయ స్థాయి ర్యాంకులను సాధించడం న్యూక్లియస్‌కు సంప్రదాయంగా మారిందని, భవిష్యత్తులో మరింత ఎక్కువ మంది ఐఐటిఎన్‌లను నంద్యాల నుంచి తయారు చేయాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తిరుగులేని ఫలితాలను అందించిన అధ్యాపకులను, విద్యార్థులను, సహకరించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మురళీధర్ రెడ్డి

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మొండి చేయి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్ర బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి మొండి చేయి చూపించి, కార్పొరేట్ సంస్థకు ప్రధాని నరేంద్ర మోడీ ఊడిగం చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామాంజనేయులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం నంద్యాల పట్టణంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయం ఎస్‌బిఐ ఎదుట పట్టణ సహాయ కార్యదర్శి సామన్న అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కె.రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్‌లు మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వానికి సిఎం మద్దతు తెలుపుతూ రాష్ట్రంలో వస్తున్న పరిశ్రమలు అదానీ కంపెనీలకు తిరిగి ఇవ్వడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటు రాముడు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు సుబ్బారాయుడు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** కేంద్ర బడ్జెట్ కేటాయింపులలో ఎపికి జరిగిన అన్యాయం, అదానీ అక్రమ ఆస్తులు, ఆర్థిక నేరాలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ప్యాపిలి పట్టణంలోని బస్టాండ్ దగ్గర నుండి పోస్ట్ ఆఫీస్ వరకు ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ సిబ్బంది రాజేష్‌కి వినతి పత్రం సమర్పించారు. సిపిఐ మండల కార్యదర్శి వెంకటేషు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రతాప్, పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రిక్షా యూనియన్ గోవిందు, పాండు రంగడు, ఆంజినేయులు, రాముడు పాల్గొన్నారు. **బనగానపల్లె :** దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని సిపిఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంకు ముందు సిపిఐ ఆధ్వర్యంలో బడ్జెట్‌లో ఎపికి అన్యాయం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. మండల ట్రెజరర్ శివ నాగయ్య, రైతు సంఘం నాయకుడు ఇమామ్ హుస్సేన్ ,యాగంటి పల్లె శాఖ కార్యదర్శి పెద్దన్న ,సోమరాజు, నాయకులు సుబ్రహ్మణ్యం, మద్దమ్మ, రామలక్ష్మమ్మ, పద్మావతి, అనిల్ కుమార్, భాస్కర్ రెడ్డి, రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** అదానీ గ్రూప్ కంపెనీ ఆస్తులను జప్తు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి వై భార్గవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎపికి జరిగిన అన్యాయంపై స్థానిక ఎస్‌బిఐ ముందు సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ నిరసనకు ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొని మద్దతు తెలిపారు. ఉదయ్ కుమార్, బాలస్వామి, ఏలియా, సోమన్న, శేషన్న, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల : ధర్నాలో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు



రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - మహానంది

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం గోపవరంలోని సెయింట్ ఆన్స్ మానసిక వికలాంగుల పాఠశాలలో, అయ్యలూరి మెట్టలోని నవజీవన్ చెవిటి మూగ పిల్లల పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ అరిఫా భాను పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తూ కంటి వైద్య శిబిరానికి సహకరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయ సూపర్డెంట్ ఆయుబ్ ఖాన్, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు యాకూబ్, మద్దిలేటి, సెయింట్ ఆన్స్ మానసిక వైద్యశాల పర్యవేక్షకురాలు సిస్టర్ రీనా జోన్స్, నవజీవన్ చెవిటి మూగ పిల్లల పాఠశాల పర్యవేక్షకులు సిస్టర్ తంగమ్, అడ్వైజర్ భాస్కరరావు, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ప్రతినిధులు, కోఆర్డినేటర్ ప్రేమసాగర్, విజన్ సెంటర్స్ కోఆర్డినేటర్ దేవయ్య, టెక్నిషియన్స్ సాయి, సుభహన్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలు భక్తిశ్రద్ధలకు ప్రతీకలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

గ్రామాల్లో పురాతన కాలం నుండి వెలసిన ఆలయాలు భక్తి శ్రద్ధలకు ప్రతీకలుగా ఉన్నాయని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పార్లపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి, వేణుగోపాల స్వామి విగ్రహాల ప్రతిష్ట, ధ్వజస్తంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డిలు హాజరై ఆలయాలను ప్రారంభించారు. అంతకుముందు ఆలయ చైర్మన్ దేరెడ్డి జనార్దన్ రెడ్డి, గ్రామ సర్పంచి షేక్ షబ్బీర్ అహ్మద్, ఉప సర్పంచ్ రామలింగారెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైసిపి యువ నాయకుడు కడిపి రెడ్డి దిలీప్ కుమార్ రెడ్డిలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలు శిథిలమైన సందర్భంగా గ్రామమంతా సమైక్యంగా ఉండి పున:నిర్మాణం చేయడం సంతోషమన్నారు. కార్యక్రమంలో నాయకులు మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆంజనేయ, వేణుగోపాల స్వామి ఆలయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గిరిజనుల అభ్యున్నతే ఎస్‌టి కమిషన్ ధ్యేయం

- గిరిజనుల జీవనోపాధికి అడ్డొస్తే ఉపేక్షించం : ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు

ప్రజాశక్తి - మహానంది

గిరిజనుల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడేందుకే ఎస్‌టి కమిషన్ ఉందని, గిరిజనుల అభ్యున్నతికి అడ్డొస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు పేర్కొన్నారు. శుక్రవారం మహానంది సమీపంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను, విద్యార్థులకు భోజన వసతులు, వసతి గదులు, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం చెంచులక్ష్మి గిరిజన గూడెం గిరిజనులు సాగు చేసుకుంటున్న ఆర్ఓఎఫ్ఆర్ పొలాలను పరిశీలించారు. అనంతరం గిరిజన గూడెం అధ్యక్షులు చలం శ్రీనివాసులు, గ్రామ సర్పంచి చలం శిరీషతో పాటు గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం జగన్ సర్కారు ఇప్పటికే 4,26,000 ఎకరాలను సాగుభూమి కోసం అందజేసినట్లు చెప్పారు. కొన్ని చోట్ల భూ సమస్యలు ఉన్నాయని, వాటిని వేగవంతంగా పరిష్కరించేలా ప్రయత్నాలు చేస్తామన్నారు. త్వరలోనే మిగతా కుటుంబాలకు కూడా భూ పట్టాలను అందజేస్తామన్నారు. గూడెం గిరిజనులు ఆధార్ కార్డు లేక, పుట్టినరోజు సర్టిఫికెట్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గిరిజన కాలనీలలో పక్కా ఇల్లు, దారులు, విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. గిరిజనుల జీవన విధానానికి అటవీ అధికారులు కొంత ఇబ్బందులు పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, వారిని సహించేది లేదన్నారు. ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేసేందుకు వెనకాడబోమన్నారు. అంతకుముందు ఆయన మహానంది క్షేత్రంలోని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం కల్యాణ మండపంలో వేద ఆశీర్వచనం, శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఎస్టీ కమిషన్ మెంబర్లు శంకర్ నాయక్, జపరంగి లిల్లీ, కుర్ర రామలక్ష్మి, మురళి, ఐటీడీఏ ప్రత్యేక అధికారి కేజీ నాయక్, మహిళా నాయకురాలు ఉసేనమ్మ, జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్, కార్యదర్శి రవికుమార్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు బాలా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ కుంభా రవిబాబు

అబ్బీపురం గ్రామ గిరిజనలను ఐటిడిఏలో చేర్చి మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ వినతి

మహానంది మండలం అబ్బీపురం గ్రామ గిరిజనులను ఐటీడీఏ లో చేర్చి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, ఎపి గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటా రాముడు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న గంగుల

ఆళ్లగడ్డలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని సాగర్ వీధిలో శుక్రవారం మల్టీసూపర్ స్పెషాలిటీ నూతన హాస్పటల్‌ను శాసనమండలి విప్ గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, నంద్యాల విజయ పాల డైరీ చైర్మన్ యస్.వి.జగన్ మోహన్ రెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్ళ లేక అవస్థలు పడుతున్న సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండటం కోసం, రోగులకు వైద్య సేవలు అందించటానికి డాక్టర్ నవీన్ కుమార్ ముందుకురావడం చాలా మంచి శుభ పరిణామమన్నారు. ఆళ్లగడ్డ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ఆందించాలని ఆస్పత్రి వైద్యులను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నరసింహా రెడ్డి, వైసిపి నాయకులు మాదం చెన్నయ్య, నల్లవాగుపల్లి మిద్దె రఘునాథ్ రెడ్డి, చింతకుంట శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

ఉయ్యాలవాడ మండలంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ గురప్ప శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉయ్యాలవాడ సబ్‌స్టేషన్లో మెయింటనెన్స్ ఉన్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, అగ్రికల్చర్‌కు 3 ఫేస్ సప్లై తెల్లవారుజామున 4 గంటల నుండి ఉంటుందని, వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

20లోగా ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోండి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 5న జరిగిన నేషనల్ మీన్స్-కం-మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు హాజరైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు ఖచ్చితంగా వారి కుల, ఆదాయ, 7వ తరగతి మార్కుల శాతం ధృవీకరణ పత్రాలు, అంగవైకల్యం ఉన్న విద్యార్థులు వైకల్యం ధృవీకరించు పత్రాలు సిద్ధం చేసుకోవాలని డిఇఒ అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

విజయ పాల డైరీలో దాదాపు 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులను అన్యాయంగా తొలగించడం దారుణమని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్షులు తోట.మద్దులు డిమాండ్ చేశారు. లేబర్ అధికారులు, యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా ఇన్చార్జి, ఏసిఎల్ బసిరున్నిసాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను అకారణంగా నాలుగు నెలల కిందట తొలగించడం అన్యాయమన్నారు. అనేక సార్లు జిల్లా లేబర్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, జిల్ల జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రాలు ఇచ్చిన సందర్భంగా విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చి ఇప్పటికే నాలుగు నెలలు గడుస్తున్నా విజయ పాల డైరీ యాజమాన్యం కార్మికులను విధుల్లోకి తీసుకోకపోవడం బాధాకరమైన విషయమని అన్నారు. లేబర్ అధికారులు విజయ పాల డైరీ యాజమాన్యం పై చర్యలు తీసుకోకపోవడం అధికార రాజకీయ పార్టీలకు కొమ్ము కాయడమేనని అన్నారు. భవిష్యత్తులో అన్ని సంఘాలను కలుపుకొని ఆందోళన ఉధృతం చేస్తామని,విజయ పాల డైరీ యాజమాన్యమే బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో జైలాన్, హారూన్, నరసయ్య, బలరాం, వెంకట్రావు, పాల డైరీ కార్మికులు ప్రసాదు, సుబ్బయ్య, ప్రభాకర్, నాగరాజు, గోపాల్, దస్తగిరి, కార్మికులు పాల్గొన్నారు.



ఏసిఎల్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్టర్ తనిఖీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్లలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా రిజిస్టర్ అధికారి సిహెచ్ రామలింగేశ్వర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, రిజిస్టర్‌కు సంబంధించిన స్కానింగ్‌ను పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌పై బేతంచెర్ల సబ్ రిజిస్టర్ అబ్దుల్ కరీంకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ సిబ్బంది రాజు, శివ, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

అంగళ్ల నిర్వహణకు వేలంపాట

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామి సన్నిధిలో జరిగిన టెంకాయల,పూలు, గాజుల అంగళ్ల నిర్వహణకు శుక్రవారం ఇఒ రామకృష్ణ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. ఇఒ మాట్లాడుతూ ఈ వేలంలో గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 4 లక్షల 75 వేల రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎస్ఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల దేవాదాయ శాఖ అధికారి నాగిరెడ్డి, దేవస్థానం సిబ్బంది సుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు కృష్ణా రెడ్డి, మిలటరీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు, జైలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని సంజామల, రేవనూరు, దొర్నిపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై సంబంధిత పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు అయ్యాయి.. అందులో భాగంగా దొర్నిపాడు పోలీస్ స్టేషన్ సంబంధించి తరుణ్, హరి, నాగదాస్, మహమ్మద్ హుస్సేన్, భాస్కర్ రెడ్డితోపాటు మరో ముగ్గురికి ఏడు రోజుల జైలు, అలాగే షరీఫ్, అన్వర్ భాషలకు రూ.2 వేలు జరిమానాను జేఎఫ్ సిఎం కోర్టు వారు విధించారని డిఎస్పి సుధాకర్ రెడ్డి తెలిపారు. సంజామల పోలీస్ స్టేషన్‌కు సంబంధించి 5 మందికి రూ. 2 వేల జరిమానా, ఇద్దరికీ 8 రోజుల జైలు శిక్ష విధించారన్నారు. రేవనూరు పోలీస్ స్టేషన్‌కు సంబంధించి రాముడు, శ్రీకాంత్‌తో పాటు మరో నలుగురికి 5 రోజుల జైలు, రూ.2500 జరిమానా, దస్తగిరి అనే వ్యక్తికి మూడు రోజుల జైలు, రూ.2500 జరిమానా విధించారన్నారు.

వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలి : టిడిపి

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్రజా వ్యతిరేఖ ప్రభుత్వంగా మారిన వైసిపికి చరమ గీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని టిడిపి డోన్ నియోజకవర్గం ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్యాపిలి పట్టణంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రజాస్వామ్యం మచ్చుకైనా కనిపించడం లేదన్నారు. ఇలాంటి నియంతకు పోయేకాలం దగ్గర పడిందన్నారు. మంచి పరిపాలన కావాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు రావాలన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, సుబ్బయ్య, సుంకయ్య, వెంకటేశ్వర రెడ్డి, రాంమోహన్, విష్ణు, పెద్ద రామాంజి నేయులు, ఖాజా పీర్, సుధాకర్, మల్లికార్జున, నాగేంద్ర, కొంగనపల్లె మధు, రామచంద్రుడు, శీను పాల్గొన్నారు.



ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

వైసిపి కీలక సమావేశానికి బిజ్జం గైర్హాజరు

- పునరాలోచనలో పార్టీ నేతలు - చెన్నంపల్లి నుండి అందని గృహ సారధుల జాబితా

ప్రజాశక్తి - అవుకు

నియోజక వర్గంతో పాటు అవుకు మండలంలో కీలక నేతగా ఉన్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధి రెడ్డి శుక్రవారం అవుకులో నిర్వహించిన గృహ సారధుల, వైసిపి బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి గైర్హాజరు కావడంతో చర్చనీయాంశంగా మారింది. నంద్యాల జిల్లాలో బలమైన రాజకీయ నేతగా గుర్తింపు ఉన్న బిజ్జం పార్థసారధి రెడ్డికి నియోజకవర్గంతో పాటు అవుకు మండలంలో బలమైన క్యాడర్ ఉంది. అయితే సొంత మండలంలో నిర్వహించే కీలకమైన కార్యక్రమాలకు ఆయన రాకపోవడంతో మండలంలో చర్చ జోరుగా సాగుతోంది. మండలంలోని అన్ని గ్రామాల నుంచి గృహ సారధులు ఈ సమావేశానికి హాజరైనా బిజ్జం స్వగ్రామం చెన్నంపల్లె నుండి గృహ సారధుల జాబితా అందలేదు. దీంతో పాటు ఆ గ్రామానికి చెందిన గృహ సారథులు కానీ, గ్రామ నాయకులు కానీ హాజరు కాలేదు. గత కొంత కాలంగా వైసిపి కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధి రెడ్డి దూరంగా ఉండటం పట్ల ప్రజలు బహిరంగంగానే పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. అంతేకాక మండలంలోని రాజకీయ విశ్లేషకులు బిజ్జం పార్థసారధి రెడ్డి నంద్యాల పార్లమెంటు నుండి ఈ దఫా (ఏదో ఒక పార్టీ నుండి) తప్పకుండా పోటీ చేస్తారని గుసగుసలు బలంగా వినిపిస్తున్నాయి.





మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సత్య ప్రకాశం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేత పత్రం ప్రకటించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కే సత్య ప్రకాశం, మండల అధ్యక్షులు ఎన్ ప్రతాప్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులకు ఒకటిన్నర సంవత్సరాలుగా చెల్లించాల్సిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ ,డిఏలు, సరెండర్ లీవులతో పాటు అనేక అరియర్లు సుమారు మూడు వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిందన్నారు. వీటిలో కనీసం కొంతమేరకైనా చెల్లింపు చేయకపోగా, వేతనాలు సైతం ఒకటవ తేదీకి చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ పరిస్థితులన్నీ గమనిస్తే రాష్ట్ర పురోగతిపై సందేహాలు కలుగుతున్నాయని, కాబట్టి వాస్తవ పరిస్థితులు ఏమిటో శ్వేత పత్రం ద్వారా వెల్లడించాలని డిమాండు చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి ఎం విజయ్ కుమార్, గౌరవాధ్యక్షులు బి.సుధాకర్, జిల్లా ఆడిట్ మెంబర్ యు.దస్తగిరి, నాయకులు మల్లికార్జున,నాగరాజు ,మదన్ గోపాల్, లక్ష్మీ నాయక్, రెహమాన్ ,చంద్రశేఖర్, పూజారి శ్రీనివాసులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాలు వేలం

ప్రజాశక్తి - గడివేముల

వివిధ కేసుల్లో 2011 నుంచి పట్టుబడిన వాహనాలను శుక్రవారం గడివేముల పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ వెంకటేశ్వరరావు, ఎస్సై బిటి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 10 ఆటోలు, 7 బైక్‌లకు వేలంపాట నిర్వహించారు. వేలంలో 3 లక్షల 2 వేల 80 రూపాయలు ఆదాయం వచ్చిందని, నగదును ఎస్పీ కార్యాలయానికి అందజేస్తామని సిఐ తెలిపారు.

అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ముత్యాలపాడు సమీపంలోని బర్డ్స్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని భార్గవిరెడ్డి అండర్-14లో జంప్ రోప్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సింధూర శుక్రవారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 4, 5వ తేదీల్లో మహారాష్ట్రలోని శిరిడిలో జరిగిన (స్కూల్ గేమ్) అండర్-14 జాతీయస్థాయి జంప్ రోప్ పోటీల్లో పాఠశాల తరపున భార్గవిరెడ్డి, షాన్ ధీరజ్, దేవసహాయంలు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారన్నారు. భార్గవిరెడ్డి 2వ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైందని తెలిపారు. త్వరలో అమెరికాలో జరగబోయే జంప్ రోప్ పోటీల్లో భారత్ తరపున ఆడనున్నట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థినిని, వ్యాయామ ఉపాధ్యాయులు శంకర్‌ను బర్డ్స్ సంస్థల అధినేత పాల్‌జారావు, హెచ్‌ఎం సింధూర, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు అభినందించారు.



అంతర్జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థిని భార్గవిరెడ్డితో హెచ్‌ఎం

శైవ క్షేత్రాలకు ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు

- నంద్యాల జిల్లా డిపో మేనేజర్ గంగాధర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు నడుపుతున్నట్లు నంద్యాల జిల్లా డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. శుక్రవారం డిపో అసిస్టెంట్ మేనేజర్ సిపి నాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలం, మహానంది, యాగంటి, భోగేశ్వరం, ఓంకారం శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు కల్పిస్తున్నట్లు చెప్పారు. శ్రీశైలంకు 50, ఓంకారం 25 బస్సులు, భోగేశ్వరం 10, మహానంది 20 బస్సులు ప్రత్యేకంగా నడుపుతున్నట్లు తెలిపారు. పాత చార్జీలే ఉంటాయన్నారు. బస్సు టికెట్‌తో పాటు శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం టికెట్లు కూడా ఆర్టీసీలో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. శ్రీఘ్ర దర్శనం రూ.220, అతి శీఘ్ర దర్శనంకు రూ.320 చెల్లించి రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న డిపో మేనేజర్

ఆర్‌బికెలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

ప్రజాశక్తి - రుద్రవరం

రైతు భరోసా కేంద్రాలలోని వసతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు కోరారు. శుక్రవారం రుద్రవరంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలోని ఎరువులను, పంట నమోదు సర్వే రికార్డులతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించి సలహా మండలి సభ్యులకు వ్యవసాయ సిబ్బందికి పలు అంశాలపై వివరించారు. రబీలో సాగు చేసిన పంటలకు పంట నమోదు సర్వే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం వెలగలపల్లె గ్రామ సమీపంలో రబీలో పంట నమోదు సర్వే నెంబర్లను పరిశీలించారు. రబీలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. సమావేశంలో ఎఒ జ్యోతి, వ్యవసాయ సిబ్బంది, సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఎఒ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మండలంలోని స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు డి.రాజ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి డి.విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత, ఉద్యానవన అధికారి హరినాథ రెడ్డి , వెటర్నరీ డాక్టర్ , సిరికల్చర్ అధికారి అరుణ, మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యులు హాజరయ్యారు. అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు. **శిరివెళ్ల :** సిరివెళ్ల మండల కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఎఒ నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్ నందు దాదాపు పదివేల ఎకరాలు సాగు చేశారని, సరిపడా ఎరువులను మండలంలో నిల్వ ఉంచామన్నారు. డిఆర్‌సి ఏవో ప్రభావతమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎంపిఒలు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** రైతు భరోసా కేంద్రాలలోని వసతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోయిలకుంట్ల ఏడిఏ కృష్ణమోహన్ రెడ్డి కోరారు. కొలిమిగుండ్లలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఏడిఏ కృష్ణమోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్‌లు పంట నమోదు, సర్వే రికార్డులతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించి సలహా మండలి సభ్యులకు వ్యవసాయ సిబ్బందికి పలు అంశాలపై వివరించారు. ఎంఈవో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు :** గ్రామాలలో ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయాలని ఏడిఏ ఆంజనేయ కోరారు. పాములపాడు వ్యవసాయ కార్యాలయం నందు మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏవో ఫణీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బికె ఇన్చార్జులు ఫర్టిలైజర్ కావలసిన వాటిని ఇండెంట్ పెట్టుకోవాలని, రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు అనిల్, సలహా మండలి కమిటీ మెంబర్స్ ఓబుల్ రెడ్డి, రామానాయుడు, స్వామి దాసు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



రుద్రవరం : పంట నమోదు సర్వేను పరిశీలిస్తున్న మోహన్ రావు



శిరివెళ్ల : మాట్లాడుతున్న అధికారి